

పెట్రోల్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని రాచగున్నేరి వద్ద మదనపల్లి–నాయుడుపేట జాతీయ రహదారి దాటుతున్న గుర్తుతెలియ వ్యక్తిని పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ రోడ్డు దాటుతున్న వ్యక్తి(సుమారు 40 ఏళ్ళు)ని వేగంగా ఢీకొనడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి

'కూటమి'లో నూతనోత్సాహం

నేడు 'సాగు'నీటి ఎన్నికలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా వ్యాప్తంగా శనివారం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆ మేరకు ఇరిగేషన్ అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయా మండల కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని తరలించారు. జిల్లా వ్యాప్తంగా 610 సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. సాగు నీటి సంఘాల ఎన్నికలకు ఇప్పటికి రెండు సార్లు నోటిఫికేషన్ జారీ అయ్యి మళ్ళీ వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు సజావుగా జరుగుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి సంఘాలకు అధ్యక్షులయ్యేందుకు ఎదురు చూస్తున్న తెలుగు తమ్ముళ్ళు నూతనోత్సాహంతో ఉన్నారు.

1.94 లక్షల ఓటర్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా విభజన అనంతరం తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1,94,268 మంది ఆయకట్టు రైతులను ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. వీరిలో 1,32,154 మంది పురుష ఓటర్లు, 62,107 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వంద ఎకరాలకు పైన ఆయకట్టుగల చెరువులన్నీ చిన్ననీటి పారుదల (ఎంఐ ట్యాంక్స్) విభాగంలోకి వస్తాయి. జిల్లా వ్యాప్తంగా 590 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాలు ఎన్నిక చేయనున్నారు. వీటితో పాటు 10,200 ఎకరాలు ఆయకట్టు కల్గిన స్వర్ణ ముఖి ప్రాజెక్టుకు 6, పిచ్చాటూరు సమీపంలోని అరణియార్ ప్రాజెక్టు ద్వారా 6,125 ఎకరాలకు గాను 5 సంఘాలకు వెరసి 610 నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 8 గంటలకే పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభమవుతుంది. పొలం సాగులో ఉండి, సర్వే నంబర్, పాసుపుస్తకం ఉంటే ఆ రైతును ఓటరుగా పరిగణిస్తారు.

తమ్ముళ్లలో నూతనోత్సాహం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండుసార్లు ఆయకట్టు ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు హయాంలో ఒకసారి జరిగాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం తర్వాత సాగునీటి సంఘాలను పూర్తిగా రద్దు చేసింది. సాగు నీటి సంఘాల కమిటీలు, వాటి అధ్యక్షులు ఉన్నప్పుడు పెద్ద ఎత్తున సాగు నీటి యాజమాన్య అభివృద్ధి పనులు జరిగేవి. చెరువులు, చెరువు కట్టలు, తూములు, వరవ కాలువలు, పంట కాలువల మరమ్మతు పనులు విరివిగా చేసేవారు. కమిటీ సభ్యులు, అధ్యక్షులకు హోదా, స్వయం ప్రతిపత్తి ఉండేది. కలుజులు, కాలువలు, తూములు పర్యవేక్షించే సిబ్బందికి సకాలంలో వేతనాలు అందేవి. అయితే సాగు నీటి సంఘాల కమిటీలు రద్దు కావడంతో ఆయకట్టు రైతులకు కష్టాలు మొదలయ్యాయి. వరవ కాలువలు, పంట కాలువలు బాగు చేసే వారు కరువయ్యారు. అయితే ఆయకట్టు సంఘాలకు ఎన్నికల షురూ అయిన నేపథ్యంలో నామినేటెడ్ పదవులు రాక నైరాశ్యంలో ఉన్న కొందరు కూటమి నేతలు, ముఖ్యంగా తెలుగు తమ్ముళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్షులు ఎవరనేది కూటమిఅధిష్టానం ఎప్పుడో నిర్ణయించేయడంతో ఓటింగ్ నామమాత్రమనే చెప్పాలి. సాగు నీటి ఎన్నికల్లో కూడా ఆయకట్టు రైతులకు తాయిలాల జాతర తప్ప లేదు. పలు చోట్ల సయోధ్య కుదరక కూటమి నేతలు ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి.

3600 మంది సిబ్బంది
మదన్ గోపాల్, నోడల్ అధికారి

జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 610 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగనుంది. అందుకోసం 3600 మంది సిబ్బందిని నియమించాం. 1,94,268 మంది ఆయకట్టు రైతులు ఓటింగ్లో పాల్గొంటారు. ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు గట్టి చర్యలు తీసుకున్నాం.

ఎన్నికలు పారదర్శకంగా చేపట్టాలి : కలెక్టర్

తిరుపతి టౌన్ : జిల్లాలో శనివారం జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, ఇరిగేషన్ అధికారులతో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఎలక్షన్‌కు సంబంధించిన మెటీరియల్ అంతా పంపించామన్నారు. పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో తాగునీటి వసతి, అత్యవసర వైద్య సదుపాయం ఉండేలా చూసుకోవాలని అన్నారు.

తుపానుకు 'గజగజ'

జలదిగ్బంధంలో గ్రామాలు

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ, యంత్రాంగం

తుపాను ప్రభావం తూర్పు మండలాల్లో అత్యధికంగా ఉంది. శుక్రవారం వర్షం ఆగినా తుపాను ఎఫెక్ట్‌తో వాతావరణం మేఘావృతమై చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణికిపోయారు. పాఠశాలలకు ముందస్తుగానే సెలవు ప్రకటించారు. ప్రాజెక్టులు, చెరువులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. బిఎన్ కండ్రిగలో జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. నీటి ప్రవాహం పెరిగి కారణి పంచాయతీలోని పాత కారణి గ్రామంలో 40 కుటుంబాలకు రాకపోకలు నిలిచిపోయి జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి. చిన్నపిల్లలకు పాలు, ఆహార పదార్థాలు అందక, వృద్ధులు అనారోగ్యబారినపడినా ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు సౌకర్యం కల్పించాలని సర్పంచులకు అనేకమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. లోతట్టు ప్రాంతాలైన కాదలూరు, మాంబట్టు, పాములమిట్ట, వాటంబేడు, కారిజాత గ్రామాల్లోకి వరదనీరు రావడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పంట పొలాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. తూర్పు మండలాల్లో అత్యధికంగా వరి సాగవుతుంది. రెండు రోజుల పాటు ఆగకుండా కురిసిన వానకు పొలాలన్నీ వరద నీటితో మునిగిపోయాయి. పలుచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. మండలంలోని కనమనంబేడు, పెద్దపాలేడు, జంబుగోళం, జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతాపురం, గాజులపెళ్లూరు, పార్లపల్లి, కాటూరు, నెలవాయి, కల్లిపెట్టు, ఆలత్తూరు, పీవీకండ్రిగ, గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాలకు పైగా వరిపైర్లు దెబ్బతిన్నాయి. అలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, జంబుగోళం, జీఎన్కండ్రిగ, పెద్దపాలేడు, కొత్తకండ్రిగ, గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉన్నాయి. కాళంగి నదిలో నీటి ప్రవాహం ఉదతంగా ఉంది. చిన్న పాలేడు గిరిజన కాలనీలో పోలయ్యకు చెందిన పూరిల్లు వర్షానికి దెబ్బతిని . గోడలు పడిపోయి, కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరుచున్నారు.

గ్రామాలకు గ్రామాలే జలదిగ్బంధం

చెరువైన అమ్మపాలెం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాలెం గ్రామంలోకి ముంపు నీరు చేరింది. సమీపంలోని చుక్కలనిడిగల్లు చెరువు నుంచి ముంపు నీరు గ్రామంలోకి చొచ్చుకొస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. చెరువు నిర్వహణ సరిగా లేని కారణంగా ముంపు నీరు క్రమంగా గ్రామంలోకి వస్తోందనీ, వర్షాలు మరింత ఎక్కువైతే పెను ప్రమాదమే పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి ముప్పు పెనుమప్పు కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తొట్టంబేడు మండలంలో సిపిఎం బృందం పరిశీలన

వెదళ్లచెరువులు పరిశీలన

రేణిగుంట : మల్లెమడుగు రిజర్వాయర్ నుండి రాళ్ల కాలువ ఆనుకొని ఉన్న వెదళ్ల చెరువు ఎస్ టి కాలనీ ముంపుకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఎలాంటి వరదలకు ముంపుకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువు అభివద్ధి పనులకు కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట కాళహస్తి ఇరిగేషన్ ఈ ఈ మదన గోపాల్, తహశీల్దార్ సురేష్ బాబు ఉన్నారు.

తుపాను బాధితులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి తుపాను ప్రభావంతో అవస్థలు పడుతున్న లోతట్టు ప్రాంత పేదలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తొట్టంబేడు మండలకేంద్రంలోని తుపాను ప్రభావిత ప్రాంతమైన ఈదులగుంటలో శుక్రవారం సీపీఎం నాయకులు పర్యటించారు. ఇళ్లల్లోకి ముంపు నీరు చేరి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించారు. లోతట్టు ప్రాంతాల్లోని పేదలు తుపాను తాకిడికి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వ యంత్రాంగానికి చీమ కుట్టినట్లు కూడా లేదని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తక్షణం స్పందించి లోతట్టు ప్రాంతాల ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు, భోజనం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదిఆంధ్రవాడలో ఇళ్లమధ్య నీరు

పుత్తూరు టౌన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. వడమాలపేట మండలం పాదిరేడు పెద్దచెరువు కట్ట ప్రమాద స్థితికి చేరుకుంది. ఆర్‌డిఒ రామ్మోమన్ కాజ్‌వేను పరిశీలించారు. కల్లూరు వద్ద నక్కలేరు వాగు పొంగిపొర్లుతోంది. కొబ్బరి, మామిడి తోటలునీట మునిగాయి.

స్వర్ణముఖి వంతెనపై గుట్టలుగా కొట్టుకొచ్చిన చెత్త

వారధి చెంత టన్నులకొద్దీ...

స్వర్ణ(చెత్త)ముఖి

రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి - నాయుడుపేట

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నాయుడుపేట స్వర్ణముఖి నదిలో నీరు నిండి వారధిపై కొంత స్వల్పంగా నీరు ప్రవహించింది. ఆ ప్రవాహానికి నదిలో నుండి చెత్తాచెదారం కొట్టుకొచ్చి వారధి పై దట్టంగా నిండిపోయింది. ఆ చెత్తాచెదారం వారధి పై భారీగా నిండిపోవడంతో నాయుడుపేట నుంచి వెంకటగిరి వైపుకు వెళ్లే వాహనాలకు గురువారం సాయంత్రం నుంచి అంతరాయం కలిగి వెంకటగిరి వైపు నుంచి నాయుడుపేటకు, నాయుడుపేట వైపు నుంచి వెంకటగిరి కి వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. వారది అవతల నాయుడుపేట చుట్టుపక్కల పల్లెల నుంచి వాహనాలు వారది దాటే దారి లేక నాయుడుపేట నుంచి వెంకటగిరి వైపు వెళ్లే వాహనాలకు పాత వెంకటగిరి రోడ్డు నే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారధి అవతల పక్కన అర కిలోమీటర్ దూరంలో ఉన్నవారు సైతం చుట్టూ ఐదారు కిలోమీటర్లు తిరిగి రావాల్సి వచ్చింది. నాయుడుపేట పట్టణ సీఐ బాబీ వెంటనే స్పందించి వారధిపై ఎవరూ తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని వాహనాలు దారి మళ్ళించారు. ఈ కారణంగా నాయుడుపేట మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎస్ కే ఫజీలుల్లా శుక్రవారం ఉదయం జెసిబి తో స్వర్ణముఖి బ్రిడ్జి పైనున్న చెత్తను తొలగించడంతో వాహనాల అంతరాయం తొలగి యధావిధిగా తిరిగాయి.

గూడూరు డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు ఏ.పి. ఎస్.ఆర్టీసీ డిపోలో కండక్టర్, డ్రైవర్ల,అక్రమ సస్పెన్షన్ లను రద్దు చేయాలని గత ఏడు రోజులుగా నిరసన ఆందోళన, కార్యక్రమాలు చేపడుతున్నా ఉన్నతాధికారుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఎస్. డబ్ల్యూ.ఎఫ్. (సి.ఐ.టి.య) ఆధ్వర్యంలో గురువారం నుండి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. శుక్రవారానికి రెండవ రోజుకి చేరుకొంది. దీక్షల్లో వై.సుధాకర్ రాజు, ఏ.శీనయ్యలు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ డిపో నాయకులు కె.యస్. వాసులు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను డిపో మేనేజర్ అమలు చేయడంలో వివక్షపూరితంగా కొంతమందికి మాత్రమే అమలు చేసి, మరి కొంతమందిని అన్యాయంగా అక్రమంగా సస్పెండ్లు చేయడాన్ని తప్పుపట్టారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో వివక్ష చూపుతున్న గూడూరు డిపో మేనేజర్ పై ఉన్నతాధికారులు ఇప్పటికైనా విచారణ జరిపించి, తగు చర్యలు తీసుకొని అక్రమంగా సస్పెండ్ చేయబడిన ఉద్యోగులను విధులలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్. డబ్ల్యూ.ఎఫ్. అధ్యక్షులు సి.హెచ్.రాము, ఎస్.కష్ణయ్య, ఇ. భాస్కర్, ఎస్.ఎస్.వి.కష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసన దీక్ష

అన్నదాతలను కూటమి ఆదుకోవాలి

డిఆర్‌ఒకు వైసిపి నేతల వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎన్నికల సమయంలో అనేక వరాలు ప్రకటించి అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అన్యాయం చేస్తోందని వైసిపి జిల్లా నాయకత్వం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేసింది.అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నేతలంతా కలిసి కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత మొదలయ్యిందని, ఎన్నికల సమయంలో చెప్పిందొకటి అధికారం చేపట్టాక చేసేదొకటిగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో మేలు చేసే కార్యక్రమాలను అమలు చేశామని, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలలోని రైతులకు ఎరువులను, పంటలను సేకరించే పద్ధతులను తీసుకొచ్చామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, రాయితీ రుణాలు, భరోసా కల్పించే విధంగా ఆర్థిక సాయం, గిట్టుబాటు ధర కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతూ జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులుకు భూమన కరుణాకర్ రెడ్డి, వైసీపీ శ్రేణులు వినతి పత్రాన్ని ఇచ్చారు. వైసిపి ధర్నా నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. ఆశించిన స్థాయి కన్నా పెద్ద సంఖ్యలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెక్టరేట్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి కలతూరు నారాయణస్వామి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ బాధ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ బాధ్యులు భూమన అభినయ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గ బాధ్యులు రాజేష్, కార్పొరేటర్ ఎస్ కే బాబు, పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట వైసిపి జిల్లా నాయకుల నిరసన

కార్పొరేషన్ కార్యాలయంలో...

దాహం దాహం

రోజూ 'బాటిల్' నీళ్లు కొనుగోలు

ఉద్యోగులు, సిబ్బంది అవస్థలు

ఫిర్యాదుదారులకూ తప్పని తిప్పలు

క్యాన్లు కొనుగోలు చేసి తాగుతున్న సిబ్బంది

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగర ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఎదురైతే కార్పొరేషన్ కార్యాలయం వైపు చూస్తాం.. అధికారులకు ఫోన్ చేస్తే ట్యాంకర్ల సాయంతో నీటిని సరఫరా చేయడం ఆనవాయితీ.. అయితే తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు, సిబ్బందికి తాగునీటి సమస్య జఠిలంగా మారింది.. ఒక్కొక్కరు రెండు మూడు బాటిళ్లు ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొని తాగే పరిస్థితి. కొంతమంది క్యారియర్లతో పాటు తాగునీటి బాటిళ్లను సైతం తెచ్చుకోవడం కనిపించింది. నగరమంతా 'తెలుగుగంగ', కల్యాణిడ్యాం నీటిని సరఫరా చేసే తిరుపతి కార్పొరేషన్ 'మినరల్ వాటర్ బాటిళ్లను' కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటోంది. పుర ప్రజలు సైతం తెలుగుగంగ, కల్యాణిడ్యాంను 80శాతం పైనే ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. కేవలం 20 శాతం మాత్రమే తాగడానికి ఉపయోగించుకునే పరిస్థితి నెలకొంది. స్వచ్ఛమైన తెలుగుగంగ నీటిని సరఫరా చేసే సిబ్బందే 'మినరల్ వాటర్ బాటిళ్లు' కొనుక్కుని తాగుతుండటం గమనార్హం. రాయలసీమలోనే తిరుపతి కార్పొరేషన్ అతి పెద్ద ఆదాయ వనరు. అయితే ఇక్కడ పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది తాగునీటి కోసం బాధలు పడుతుండటం గమనార్హం. కనీసం ఆర్ఒ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయకపోవడం కార్పొరేషన్ నిర్లక్ష్యానికి నిదర్శనం.

కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులు దాహం తీర్చుకునేందుకు వాటర్ బాటిళ్లు, క్యాన్లు తెచ్చుకుంటున్నారు. కొందరైతే బాటిళ్లు, క్యానులు కొనుగోలు చేసి బీరువాల్లో భద్రపరచుకుంటున్నారు. దాహం వేసినపుడు అపుడపుడు బీరువాలో నుంచి వాటర్ బాటిళ్లను తీసుకుని తాగుతున్నారు. ఇంకొంతమంది రెండు రోజులకు ఒకసారి వాటర్ క్యాను తెప్పించుకుని తాగుతున్నారు. పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రెండు పెద్ద ఫ్రిజ్‌లను ఏర్పాటు చేసి ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కార్పొరేషన్ కార్యాలయాన్ని స్విమ్స్ ఆస్పత్రి వద్దకు మార్చడం వల్ల ఉద్యోగుల, సిబ్బంది తాగునీటి విషయాన్ని విస్మరించారనే ఆరోపణలున్నాయి. కమిషనర్ మౌర్య స్పందించి ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. తాగునీటి కోసం ఉద్యోగులు రోజుకు 20–30 రూపాయలు డబ్బులు వెచ్చిస్తుండటం గమనార్హం. నెలకు తాగునీటికే వెయ్యి రూపాయల పైన ఖర్చు అవుతుందని అంచనా.

కమిషనర్, మేయర్ ఛాంబర్లలోనూ అంతే

ఉద్యోగులు, సిబ్బందే కాదు, కమిషనర్ మేయర్ ఛాంబర్లలో సైతం వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకుని తాగాల్సిందే. అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేషన్ ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగంతో పాటు రెవెన్యూ విభాగం కూడా డబ్బులు ఖర్చు పెట్టి నీళ్లను కొనుగోలు చేస్తోంది. డిపార్టుమెంట్లలో కొనుగోలు చేసే క్యాన్లకు బిల్లులు పెడుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయం లోపలే తాగునీటి సమస్య తీర్చలేకున్న పరిస్థితి.

ఫిర్యాదుదారులకు ఇక్కట్లు

ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే ప్రజా పరిష్కారాలు వేదిక కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి అనేకమంది అర్జీలతో కార్పొరేషన్ కార్యాలయానికి వస్తుంటారు. వీరు కూడా తాగునీటి కోసం ఇబ్బందులు గతంలో ఎదుర్కొన్నారు. ఇటీవల కాలంలో ఓ ఫ్రిడ్జ్ కార్పొరేషన్ కార్యాలయం బయట ఏర్పాటు చేశారు. అది ఏమాత్రం ప్రజలకు వినియోగంలో లేదని తెలుస్తోంది. దూరప్రాంతాలు నుంచి వచ్చే ప్రజలకు ఆరో ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీరు వసతి కల్పిస్తే బాగుంటుందని అర్జీదారులు అంటున్నారు. మిగిలిన రోజులు కూడా ప్రజలు కార్పొరేషన్ కార్యాలయానికి వందలాదిమంది వివిధ పనులపై వస్తు పోతుంటారు వారు కూడా దగ్గర్లో ఉన్న షాపు వద్ద బాటిళ్లను కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి. కమిషనర్ మౌర్య అర్జిదారుల కోసం ప్రత్యేకమైన ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని కోరుతున్నారు

నిరుపయోగంగా ఉన్న ఆర్ఒ ప్లాంట్

స్కిమ్స్ లో ఎఫ్ఈవైసీ వర్క్ షాప్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక స్కిమ్స్ కళాశాలలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్, కోటక్ సెక్యూరిటీ సంస్థలు సంయుక్తంగా 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్' అనే అంశంపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గీతా దేవి, ఎన్ఐఎస్ఎం అప్రూవల్ ట్రైనర్ డాక్టర్ బి నాగార్జున మ్యూచువల్ ఫండ్స్, ప్రైమరీ మార్కెట్స్, సెకండరీ మార్కెట్స్, ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్వెస్ట్మెంట్స్, ఫైనాన్షియల్ ఆపర్చునిస్, కెరియర్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ ఆన్లైన్ పరీక్షలను నిర్వహించి సర్టిఫికెట్స్ అందజేశారు.

స్వర్ణముఖిలో వరద ఉధృతం

ప్రజాశక్తి - వాకాడు

స్వర్ణముఖి నదిలో వరద ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం నాటికి వాకాడు స్వర్ణముఖి నదిలోకి 27వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఒక్కసారిగా రావడంతో బ్యారేజికి చెందిన 34 గేట్లకు గాను ఏడు గేట్లు ఎత్తి దిగువకు వరద నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులు తెలిపారు. బ్యారేజీని సందర్శించి, వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రస్తుతం శుక్రవారం వర్షం కురవకపోవడంతో వరద ప్రవాహం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. బ్యారేజికి చెందిన అన్ని చెరువులకు జలాలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎఇలు జి.కృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిలవకుండా చూడండి : కమిషనర్

తిరుపతి టౌన్ : వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. వర్షాల వల్ల నీరు నిలిచిన లక్ష్మీపురం, నారాయణపురం ప్రాంతాల్లో ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ప్లానింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సరఫరా చేసే నీరు సురక్షితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. మెయిన్ రోడ్డు పక్కనే చేపల మార్కెట్ ఉండడం వలన దుర్గంధం వస్తోందని ఫిర్యాదులు రావడంతో చేపల మార్కెట్ను పరిశీలించారు. మార్కెట్కు వెనుక వైపు ఉన్న ప్రాంతంలోనికి మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

చెత్త సేకరణ విధిగా నిర్వహించాలి

తిరుపతి నగరంలో ప్రతి ఇంటి వద్ద, వ్యాపార సముదాయాల వద్ద నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల జి.పి.ఎస్. ట్యాగింగ్, వాహనాల రూట్ మ్యాప్ తదితర అంశాలపై హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశమై సమీక్షించారు. వంద శాతం ముఖ ఆధారిత హాజరు నమోదు చేపట్టాలని అన్నారు.

బిఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు 'అదాలత్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బిఎస్ఎన్ఎల్లో ఉద్యోగ విరమణ చేసిన వారి సమస్యలు పరిష్కరించడానికి అదాలత్ నిర్వహించినట్లు చీఫ్ కమర్షియల్ అకౌంటెంట్ తారాచంద్ అన్నారు. భీమాస్ డీలక్స్ హోటల్లోని కాన్ఫరెన్స్ హాలులో బిఎస్ఎల్ఎల్, డిఒటి పెన్షనర్లకు సంబంధించి సర్కిల్క్వార్టర్లీ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అదాలత్ కు సి సి ఏ ఆఫీసు విజయవాడ నుండి తారాచంద్, సి సి ఏ, బిఎస్ఎన్ఎల్ తరుపున తిరుపతి నుండి డీజీఎం వెంకోబరావు పాల్గొన్నారు. వీరితో పాటు ఇతర సిబ్బంది కపాజ్యోతి , నాగమహేశ్ , శ్రీనివాస్ , పద్మజ , కుమారి నీరజ పాల్గొన్నారు. తారా చంద్ మాట్లాడుతూ సీసీఏ ఆఫీసు చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీసీఏ ఆఫీసు వారు వచ్చిన పెన్సనర్ల కోసం ఆండర్సన్ ల్యాబ్స్ సౌజన్యం తో ఉచిత హెల్త్ క్యాంప్ ను నిర్వహించారు. పింఛను దారులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు ఆర్సి పురానికి ఏపీ ఈఆర్సి ఛైర్మన్ రాక

ప్రజాశక్తి - రామచంద్రాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటింగ్ కమిషన్ ఛైర్మన్ రామ్ సింగ్ ఆర్సీపురంలో పర్యటించనున్నట్లు పుత్తూరు ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆశీర్వాదం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండలంలోని కుప్పంబాదూరు గ్రామంలో ఉన్న రాయలచెరువు పేట విద్యుత్ సబ్స్టేషన్ను పరిశీలించనున్నారు. అనంతరం వెదురుకుప్పం మండలం పచ్చికాపలం సమీపంలోని ఎర్రగుంట వద్ద ఉన్న 220 విద్యుత్ సబ్స్టేషన్ను పరిశీలించనున్నారు.

నేడు జాతీయ లోక్అదాలత్

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్

పుత్తూరు కోర్టులో శనివారం ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్అదాలత్లో కేసులు పరిష్కరించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలక్రిష్ణ వ్యవహరిస్తారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల బీమా చేయించుకోవాలి

బిఎన్ కండ్రిగ : సాగులో ఉన్న ప్రతి పంటకూ రైతులు బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి భారతి కోరారు. శుక్రవారం వరుత్తూరు గ్రామపంచాయతీ ప్రాంగణంలో సర్పంచి దయాకర్ అధ్యక్షతన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. మూడు శాతం ప్రీమియంలో రైతులు ఒకశాతం, ప్రభుత్వం మిగిలిన సొమ్ము చెల్లిస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులు లబ్ది పొందాలంటే వన్బికి ఆధార్ లింక్ తప్పనిసరి అన్నారు.

పిఆర్క్లబ్ సేవలు అభినందనీయం : ఎంఎల్ఏ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు సేవా కార్యక్రమాల నిర్వహించడం అభినందనీయమని, రాబోయే రోజుల్లో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్ రావు, మీరారెడ్డి, మధు, మస్తాన్ నాయుడు, సిద్ధారెడ్డి, వెంకటసుబ్బయ్య, పులిమి శ్రీనివాసులు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి సరికాదు

పుత్తూరు టౌన్ : సినీ నటుడు మోహన్ బాబు, మంచు మనోజ్ వ్యక్తిగత పంచాయతీలో జర్నలిస్టులపై దాడి సరికాదని, పుత్తూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్. ఎన్ . ధనపాల్ శుక్రవారం. తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ఈ ఘటనపై విచారణ జరిపి జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు.

మద్యం సేవించిన వారికి కోర్టులో జరిమానా

ప్రజాశక్తి- ఏర్పేడు

ఏర్పేడు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయచంద్ర బహిరంగంగా మద్యం సేవించిన 26 మందిని శ్రీకాళహస్తి పీ జే సీజే కోర్టులో హాజరు పరిచారు. ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున 13వేల రూపాయలు, వాహనం నడిపిన ఇద్దరికీ ఒక్కొక్కరికి 10వేల చొప్పున జరిమానా విధించారు.

పంట పొలాల్లో...ఏనుగుల గుంపు తిష్ట

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు

గత రెండు మూడు రోజులుగా ఏనుగుల గుంపు స్థానికంగా తిష్టవేసి అన్నదాతలకు కునుకు లేకుండా చేస్తోంది. ఓ వైపు పంటలను కాపాడుకోలేక, వెళితే తమ ప్రాణాలు ఎక్కడ పోతాయోనన్న భయంతో హడలెత్తుతున్నారు. రోజూ పంటలను, మోటార్లను, పైపులను, తీగ కంచెలను ధ్వంసం చేసి లక్షలాది రూపాయలు నష్టాలను కలిగిస్తున్నాయి. అనేకమార్లు ఫారెస్టు అధికారులకు విన్నవించినా వారు చేతులెత్తేయడంతో ఇక సేద్యం చేయలేమన్న స్థితికి వచ్చేశారు. వ్యవసాయం ఖర్చుతో కూడుకున్న విషయంగా మారడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడిపెట్టి సాగు చేసినా, పంట చేతికొచ్చే

సమయంలో ఏనుగుల నాశనం చేస్తుండడంతో అన్నదాతల మనోవేదన వర్ణనాతీతం. గత మూడు రోజులుగా ఎగవూరు, దిగవూరు, భాకరాపేట గ్రామాల్లో రాత్రుల్లో వీటి సంచారం ఎక్కువగా వుంటోందని, గడపదాటి పోవాలంటే భయపడి ఇంటికే పరిమితమైపోయామని పండించిన పంటలపై ఆశలు వదిలేసామని రైతులు వాపోవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు ఎలాంటి చర్యలుకాని, పరిశీలనకాని చేయలేదని, ఇది షరా మామూలే అన్నట్టుగా వుండిపోయారని అంటున్నారు. ఎమ్మెల్యే పులివర్తినాని స్వయంగా ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. భరోసా కల్పిస్తూ ఏనుగుల కదలికలు గుర్తించి పంటలపై పడకుండా చర్యలు తీసుకోవాలని ఫారెస్టు అదికారులకు సూచించినా అటువైపు అడుగులు పడలేదని బాదిత రైతులు అంటున్నారు. ఏనుగుల గుంపు గ్రామాల వైపు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు ఆపాలని 'బిల్లులు' దగ్ధం

ప్రజాశక్తి - రేణిగుంట

అదానీతో కుదుర్చుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను విరమించుకోవాలని, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దని, పెంచిన ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. శుక్రవారం రేణిగుంట మండలం తిమ్మయ్యగుంట గ్రామంలో ప్రజలతో కలిసి భారంగా మారిన విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు ఒ.వెంకటరమణ, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కె.హరినాథ్ మాట్లాడుతూ తిమ్మయ్యగుంట

దళితవాడలో చంద్రముఖి ఇంటికి లైట్లు, ఫ్యాను, ఫ్రిడ్జ్ ఉన్నాయని, డిసెంబర్ నెలలో 254 యూనిట్లకు గాను 1538 కరెంట్ బిల్లు వచ్చిందన్నారు. కూలి పని చేసుకునే దళిత కుటుంబానికి అంత అధిక భారం వేస్తే ఎలా కట్టగలరని ప్రశ్నించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ఫోన్ రీఛార్జి చేసుకున్నట్లే, విద్యుత్కు బ్యాలెన్స్ అయిపోగానే కరెంట్ ఆగిపోతుందన్నారు. మళ్లీ రీఛార్జి చేసుకుంటేనే లైటు వెలుగుతుందన్నారు. ప్రజలు స్మార్ట్మీటర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ఈశ్వరమ్మ, కుప్పస్వామి, చెంగల్రాయులు, చంద్రముఖి, చంద్ర, పరశురాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుత్తూరులో విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

దక్షిణ మధ్య రైల్వే గుర్తింపు ఎన్నికల్లో డిఆర్ఇయు (సిఐటియు) ఘన విజయం సాధించడంతో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పుత్తూరు రైల్వేస్టేషన్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ టపాకాయలు కాల్చుకుంటూ, డ్రమ్స్ మేళాలతో రైల్వే ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ 11 ఏళ్ల తరువాత డిఆర్ఇయు దక్షిణ మధ్య రైల్వేలో ఈనెల 4, 5 తేదీల్లో ఎన్నికలు జరిగాయన్నారు. 12వ తేదీ ఫలితాలు వచ్చాయని, ఎస్ఆర్ఎంయు యూనియన్ కంటే డిఆర్ఇయు ఘన విజయం సాధించిందన్నారు. చెన్నయ్ డివిజన్ మొత్తం ఎర్రజెండా ఎగిరిందన్నారు. పుత్తూరులో మొట్టమొదటిసారిగా డిఆర్ఇయు ఎర్రజెండా ఎగరడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే డి ఆర్ ఈయు అధ్యక్ష కార్యదర్శులు సురేష్, విజయ భాస్కర్, నాయకులు నాగరాజ్, పాండియన్, సిఐటియు నాయకులు ఏ విజయ్, యాసిన్ భాష, పురుషోత్తం, ప్రవీణ్ కుమార్, కష్ణమూర్తి, యువరాజ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్ర సహకారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం సహకారం తీసుకుంటామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలనీ, దానికి తగిన నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి పరిచి విస్తరింప చేయాలని రైల్వే అధికారులను కోరారు. టీడీపీ పట్టణాధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి తండ్రి చంగల్ రాయల్ రెడ్డి 5వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక పెండ్లి మండపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అంజూ రు శ్రీనివాసులు చంగల్రాయల్ రెడ్డి సేవలను కొనియాడారు. కంటా ఉదయ్ కుమార్, రత్నం రెడ్డి, టోపి గోపి, భరత్ కుమార్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'సెడాన్ టు ది కోర్'గా రూపొందించబడిన పూర్తి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టొయోటా కిర్లోస్కర్ మోటర్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ , చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మసకాజు యోషిమురా మాట్లాడుతూ కార్బన్ న్యూట్రల్ లక్ష్యాలను సాధించడంలో తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, పూర్తి సరికొత్త క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనం, అధునాతన 5వ తరం హైబ్రిడ్ టెక్నాలజీని కలిగి ఉందన్నారు. ఈ కొత్త మోడల్ అత్యాధునికమైన సేఫ్టీ ఫీచర్లు, మెరుగైన ఎక్స్టీరియర్స్, ఇంటీరియర్లు, సౌకర్యవంతమైన సాంకేతికత అనుసంధానితతో సాటిలేని అధునాతనతను తెస్తుందన్నారు. సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్

మాట్లాడుతూ , "ఆల్-న్యూ క్యామ్రీ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఆవిష్కరణ భారతదేశంలో తమకు ఒక ఉత్తేజకరమైన మైలురాయి అన్నారు. దీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుమల నడకమార్గంలో భక్తుడు మృతి

ప్రజాశక్తి - తిరుమల

అలిపిరి నడకమార్గంలో గుండెపోటుతో [illegible] మృతిచెందాడు. 37వ మలుపు వద్ద మెట్ల మార్గంలో గుండెపోటుతో మృతిచెందిన భక్తుడు హైదరాబాద్కు చెందిన రవికుమార్ (38)గా గుర్తించారు.

రెవెన్యూ సమస్యలు సత్వర పరిష్కారం : తహశీల్దార్



ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ, యంత్రాంగం

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం మండలంలోని పార్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. స్మశానానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో శవాన్ని పంట పొలాల్లో తీసుకుపోవాల్సి వస్తుందని, దారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ సుధాకర్నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్.ఐ నల్లయ్య, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్, డిప్యూటీ సర్వేయర్ రాజ్ కుమార్, విలేజ్ సర్వేయర్, వాసు, వీఆర్ఓ తిరుమలేష్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్లో... చెన్నూరు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయంలో తహశీల్దార్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది.తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, యారముపు హేమంత్రెడ్డి, కరుణాకర్రెడ్డి పాల్గొన్నారు. రైతుసంఘం నాయకులు బివి రమణయ్య, వి.భాస్కర్రెడ్డి పాల్గొన్నారు.

ఐఎఎస్ఈ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవం 2024 కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఐఎఎస్ఈ విద్యార్థులు నత్యంలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత యువకులే రేపటి పౌరులుగా పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్క భారతీయుల పైన ఉందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఐఎఎస్ఈ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.జానకిరామయ్య మాట్లాడుతూ విద్యార్థులను ఎంత క్రమశిక్షణగా మెలుగుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ప్రతి విద్యార్థి మంచి పౌరుడుగా తయారు అవ్వాలని విద్యార్థులను ప్రోత్సహించడం వలనే నత్యంలో ద్వితీయ స్థానం సాధించగలిగారు. ఈ కార్యక్రమంలో ఐఎఎస్ఈ కళాశాల అధ్యాపకులు సంధ్యారాణి, ప్రగతి, కవిత, దస్తగిరిరెడ్డి, జయచంద్ర, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

'యువ ఉత్సవ్' ప్రతిభకు వేదిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉండడంతోపాటు వారిలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయని జిల్లా యువజన అధికారి, టీటీడీ బోర్డు సభ్యులు జి భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. యువతరం సానుకూల దక్పథంతో ఈ పోటీ ప్రపంచంలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని యువతకు ఉద్బోధించారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ,నెహ్రూ యువ కేంద్ర , చిత్తూరు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి జి. జ్ఞానశేఖర్ రెడ్డి మాట్లాడుతూ యువ ఉత్సవ్ లో భాగంగా ఇండియా ఏ2047 నాటికే దేశం ప్రపంచానికి దిక్సూచి లా ఉండాలన్నారు.

తేనెటీగల పెంపకంలో స్టాటప్ అవకాశాలు

క్యాంపస్ : తేనెటీగల పెంపకంలో స్టాటప్ అవకాశాలు ఉంటాయని మలేషియాలోని విశ్వవిద్యాలయం తెరన్గనూ, క్యూలానేరూస్ అధ్యాపకులు డాక్టర్ మన్సూరు ఇస్మాయిల్ పేర్కొన్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ డిబిటి, బిల్డర్ టీం సంయుక్తంగా లైవ్ అగ్రిటెక్నాలజీస్పై స్టార్టప్ అవకాశాలు అంశంపై మూడు రోజుల పాటు జాతీయ వర్కుషాపు శుక్రవారం ముగిసింది. డా.మన్సూర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మలేసియాలోని వివిధ తేనెటీగల పెంపకంలో స్టాటప్ అవకాశాలను గురించి వివరించారు. వెటర్నరీ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డా. బి. శోభామణి, ఎస్వియూ రాజనీతి శాస్త్రాల విభాగం ప్రొఫెసర్ బివి మురళీధర్ పాల్గొన్నారు.

పశువైద్యంలో నూతన పరిశోధనలు

ప్రజాశక్తి - క్యాంపస్

పశువులకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులు వాటికి వినియోగించే మందులు, వ్యాధి నివారణ మార్గాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త నూతన పరిశోధనలను రైతులకు అందేలా కషి చేయాలని పశువైద్య విద్య పీజీ, పరిశోధక విద్యార్థులకు ఇన్చార్జి విసి డాక్టర్ జె.వి.రమణ పిలుపునిచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో దేశంలో మొట్టమొదటిసారిగా పీజీపీహెచ్డీ పరిశోధక విద్యార్థులకు మైల్ స్టోన్ ఇన్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఇంప్రూవ్మెంట్ ఆఫ్ అనిమల్ హెల్త్ అండ్ ప్రొడక్షన్ అండ్ అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. వర్సిటీ డీన్ డాక్టర్ కే. వీరబ్రహ్మయ్య, ఆర్గనైజింగ్ జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. జగపతి రామయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సదస్సు కో ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ రాజ పాల్గొన్నారు.

రిమ్స్లో ఘనంగా టెక్నో అండ్ గ్యాబ్ ఫెస్ట్ 2కే24

ప్రజాశక్తి - క్యాంపస్

తిరుపతిలోని స్థానిక కొండారెడ్డి " రాయలసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ " (రిమ్స్)లో ఎంబిఎ, ఎంసిఎ, ఎంపిసిస్ (కంప్యూటర్ సైన్స్) విద్యార్థులకు మూడు రోజుల టెక్ని, గ్యాబ్ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభమైనది. కళాశాల ప్రిన్సిపాల్ డా.జె ప్రకాశ్ రెడ్డి, హెచ్ఓడిలతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టిపల్లి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి వున్న సజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

నర్సింగ్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏపీ ఎస్ఎస్డిసి మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొని భవిష్యత్లో హెల్త్ కేర్ సెక్టార్ నందు వివిధ దేశాల్లో ఉన్న నర్సింగ్ ఉద్యోగాల కొరకై రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకశాలపై, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాష పై ఆరు నెలల శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించి కనీసం నెలకు 2.5లక్షల నుండి 3.5లక్షల రూపాయలు జీతంతో కూడిన ఉద్యోగా అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా స్కూల్ ఆఫ్ నర్సింగ్,ప్రిన్సిపాల్ గంగాభవాని, రీజినల్ చీఫ్ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఆర్. లోకనాదం, మురళి పాల్గొన్నారు..

కొత్తపల్లి డ్రైనేజీ కల్వర్టుపై గోడ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గత రెండు రోజులుగా తిరుపతి నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సందర్భంగా శుక్రవారం సిపిఎం నగర బందం కొత్తపల్లి స్కావెంజర్స్ కాలనీ ప్రాంతాలలో పర్యటించింది. గోడ లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందిగా ఉందని, పిల్లలు అందులో ప్రమాదవశాత్తు పడే అవకాశం ఉందన్నారు. పాములు సైతం ఇళ్లల్లోకి వస్తున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ మధురానగర్లో ఎంసియు స్కూలు అని పెట్టారని, అయితే ఎక్కడా ఆ ప్రాంతంలో ఆస్కూలు లేదని, ప్రియదర్శిని స్కూలు కూడా లేదన్నారు. ఈ స్కూళ్ల చిరునామా ఎక్కడ అని టోల్ఫ్రీ నంబర్కు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా బాధ్యతారాహిత్యంగా వెరిఫై చేసి చెబుతామని చెప్పడం శోచనీయమన్నారు.

ఎస్వీ వైద్య కళాశాల 12 సీట్ల ఫోర్స్ వాహనం వితరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎస్వీ వైద్య కళాశాలకు తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ సుమారు 20 లక్షలు విలువ చేసే ఫోర్స్ వాహనాన్ని ఎస్ వి వైద్య కళాశాలకు వితరణగా అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ సి. వి.ఎన్ భాస్కరరావు ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు వాహన తాళాలు అప్పగించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సి వి ఎన్ భాస్కరరావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఎస్వీ వైద్య కళాశాలకు తమ యూనియన్ బ్యాంక్ తరపున సామాజిక సేవ కొరకు, పేద రోగులకు వైద్యం అందించడంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని, ఇలాంటి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు ప్రాథమిక చికిత్సలు అందించడంలో ఎస్ వి వైద్య కళాశాల ఎప్పుడు ముందుంటుందని, సంతోషం వ్యక్తపరిచారు. జోనల్ హెడ్, రీజనల్ డైరెక్టర్ జి రామప్రసాద్, ఎస్ వి వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ స్వాతి పాల్గొన్నారు.

'షార్'లో గగన్యాన్ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారత అంతరిక్ష ప్రయోగ సంస్థ అంతరిక్షంపై పట్టు సాధించడానికి ఇస్రో అంతరిక్షంలోకి మనిషిని పంపాలనే లక్ష్యంతో ముందుకు పోతుంది. ఇందులో భాగంగా రూపొందిస్తున్న గగన్ యాన్ రాకెట్ ప్రయోగానికి సంబంధించి ముందుగా మానవ రహిత గగన్ యాన్ ప్రయోగం కోసం ఇస్రో షార్ సెంటర్ లో పనులు ప్రారంభించింది. దీనికోసం హెచ్ఎల్వియ్యం3- జి 1రాకెట్ ను సిద్ధం చేస్తుంది. ఈ రాకెట్లో కీలక మైన దశగా భావించే మొదటి సాలిడ్ మోటార్ సెగ్మెంట్ ను ఉత్పత్తి ప్లాంట్ నుండి లాంచ్ కాంప్లెక్స్ వరకు తరలించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జండా ఊపిన అనంతరం సాలిడ్ మోటార్ సెగ్మెంట్ వాహనాన్ని లాంచ్ కాంప్లెక్స్ కు తరలించారు.

కాజ్వే మరమ్మతులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి)

చంద్రగిరి మండలం నడింపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి స్వర్ణముఖి నది పైన ఉన్న తాత్కాలిక వంతెన గురువారం కురిసిన భారీ వర్షాలకు ప్రమాదకర పరిస్థితికి చేరుకోవడంతో టిడిపి సీనియర్ నాయకుడు దొమ్మలపాటి సతీష్ నడుం బిగించి కాజ్ వే రక్షణ చర్యలకు పూనుకున్నారు.2021 నవంబర్ లో వచ్చిన వరద ప్రవాహానికి గతంలో నిర్మించి ఉండిన క్యాజువే పూర్తిగా దెబ్బతింది.గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులే చందాలు వేసుకొని రాకపోకలు సాగించడానికి తాత్కాలికంగా పైపులు ఏర్పాటు చేసుకొని రోడ్డు సిద్ధం చేసుకున్నారు అయితే గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షంతో పాటు గురువారం పడిన భారీ వర్షానికి స్వర్ణముఖి నది ఉదతంగా ప్రవహించడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న వంతెన కూడా ప్రమాద స్థితికి చేరింది. ఈ పరిస్థితిని చూసిన టిడిపి నేత దొమ్మలపాటి సతీష్ గ్రామస్తులతో చర్చించి మరమ్మత్తు చర్యలకు పూనుకున్నారు.